సాక్షి తిరుపతి

సోమవారం । 1 । జనవరి । 2024



తుమ్మలగుంటకు సరి'కొత్త' శోభ

తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. - IIలో



క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. - IIలో



చెరువులోకి దూసుకెళ్లిన కారు

కేవీబీపురం మండలం మిద్దెకండ్రిగ వద్ద ఓ కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందారు. - IIలో

న్యూస్‌రీల్

5 లడ్డూ కౌంటర్లకు ఎస్‌బీఐ స్పాన్సర్ షిప్



నూతన కౌంటర్లు ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, బ్యాంకు ఎండీ

తిరుమల: తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో గల 5 కౌంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ షిప్ అందించింది. ఈ మేరకు ఆయా కౌంటర్లలో ఆదివారం ఉదయం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, బ్యాంకు ఎండీ శ్రీనివాసశెట్టి పూజలు చేసి ప్రారంభించారు. ఇకపై ఈ ఐదు కౌంటర్లను బ్యాంకు నిర్వహిస్తుంది. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పెంచలకోనకు 'నూతన' శోభ



దేదీప్యంగా పెనుశిల క్షేత్రం

రాపూరు : పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీ నృసింహస్వామి ఆలయం నూతన సంవత్సరం వేడుకలు ముస్తాబైంది. పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో విద్యుద్దీపాలతోపాటు వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేసినట్లు వివరించారు. భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు, అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.

నవశకం

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి.. గ్రామీణులకు సైతం మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలి.. పల్లెవాసులకు ఇంటి ముంగిటనే సేవలు అందించాలి.. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సకాలంలో నాణ్యమైన చికిత్సలు చేయించాలి.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పేరిట ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైద్యసేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ చేశారు.



ఓజిలిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ (ఇన్‌సెట్) తాళ్వాయిపాడు విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సుజాత (ఫైల్)

అందుబాటులో ఆరోగ్యం

- ప్రజల ముంగిటకే వైద్యం
- గ్రామీణులకు సకాలంలో సేవలు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సైతం చికిత్సలు
- అవసరాల తగ్గట్టు ఉచితంగా మందులు
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై వెల్లువెత్తుతున్న ప్రశంసలు

సూళ్లూరుపేట : ప్రజారోగ్య రక్షణే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణా ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పట్టణాల పరిధిలో అర్బన్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి సంబంధించి సూళ్లూరుపేట మండలంలో 10, నాయుడుపేట మండలంలో 13, తడ మండలంలో 15, ఓజిలి మండలంలో 8, దొరవారిసత్రం మండలంలో 11, పెళ్లకూరు మండలంలో 13 క్లినిక్‌లు ప్రజలకు సేవలందిస్తున్నాయి.

నాణ్యమైన వైద్యం

విలేజ్ క్లినిక్‌లలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. చిన్నపాటి జబ్బులే కాకుండా బీపీ, షుగర్, టీబీ, హైపర్ టెన్షన్, లెప్రసీ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు కూడా చికిత్స చేయడంతోపాటు అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారు. ఈసీజీ, రక్త పరీక్షలు చేసి వ్యాధులను నిర్ధారిస్తున్నారు. అందుకు తగట్టుగానే వైద్యం అందిస్తున్నారు. ఒకవేళ ఆయా క్లినిక్‌లలో చికిత్స చేయలేని కేసులను 108 అంబులెన్స్ ద్వారా ఆరోగ్యశ్రీ పరిధిలోని ప్రైవేట్,, జనరల్ ఆస్పత్రులకు రెఫర్ చేసి పంపుతున్నారు. ఈ క్రమంలోనే గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. గర్భిణులకు ప్రసవం అయ్యే వరకు ఎప్పటికప్పుడు పరీక్ష చేస్తూ పౌష్టికాహారం అందజేస్తున్నారు. బాలింతలు రక్తహీనతకు గురికాకుండా చర్యలు చేపడుతున్నారు. అలాగే శిశువులకు సకాలంలో టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో విలేజ్ క్లినిక్‌లో ఓ మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ సిబ్బంది ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పక్కాగా వైద్యసేవలందిస్తున్నారు.

సంతోషంగా ఉంది



మా గ్రామంలోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. పక్కా భవనం నిర్మించి అవసరాల మేరకు వైద్య సిబ్బందిని నియమించారు. దీంతో చిన్న చిన్న వ్యాధులకు ప్రైవేటు ఆస్పత్రికి పరుగులుతీయకుండా స్థానికంగానే వైద్యం పొందుతున్నాం. ఉచితంగా మందులు సైతం అందుతున్నాయి. ఇంటి ముంగిటకే వైద్య సేవలు రావడం సంతోషంగా ఉంది.

– నిరోషా, మానమాల, ఓజిలి మండలం

సకాలంలో వైద్యం



మా ఊళ్లో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయడంతో సకాలంలో వైద్యం అందుతోంది. గతంలో చిన్నపాటి ఇబ్బంది వచ్చినా నాయుడుపేటకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పాయి. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. క్లినిక్‌లో చక్కగా వసతులు ఉండడంతో ఎలాంటి భయాందోళ లేకుండా చికిత్స పొందుతున్నాం.

– కోటమ్మ, తాళ్వాయిపాడు గిరిజనకాలనీ, పెళ్లకూరు మండలం

ఉచితంగా మందులు



నేను బీపీ, షుగర్ వ్యాధులతో చాలా ఏళ్లుగా బాధపడుతున్నా. వైద్యపరీక్షలకు, మందులు తెచ్చుకునేందుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని తడకు వెళ్లేదాన్ని. ఆటోలో రానుపోను ప్రయాణానికి చాలా డబ్బు ఖర్చయ్యేది. ఇప్పుడు మా ఊళ్లోనే విలేజ్ క్లినిక్ ప్రారంభించారు. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్ష చేస్తున్నారు. అవసరమైన మందులన ఉచితంగానే అందిస్తున్నారు. జగనన్న మేలు మరువలేం.

– పి.పద్మ, వాటంబేడు, తడ మండలం

ఇంటికే వైద్యం



మా మామయ్య మద్దూరు రమణయ్య పక్షవాతం కారణంగా మూడేళ్లుగా మంచంలోనే ఉన్నారు. గతంలో వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లాలంటే నానా ఇబ్బందులు పడేవాళ్లం. వాహనాలకే చాలా వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి జగనన్న హెల్త్ క్లినిక్ తీసుకురావడంతో ఇంటి వద్దనే వైద్యం అందుతోంది. డాక్టర్లు సైతం చక్కగా పరీక్షించి మందులు అందిస్తున్నారు.

– మద్దూరు అనిత, జువ్వలపాళెం, నాయుడుపేట

ప్రతి ఇంటా ఆనందాలు నిండాలి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి ఆర్‌కే రోజా

తిరుపతి అర్బన్/చిత్తూరు కలెక్టరేట్: 2024లో ప్రతి ఇంటా ఆనందాలు నిండాలని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, విద్యుత్ శాఖమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, క్రీడా శాఖామంత్రి ఆర్కే రోజా ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఇంకా రాజంపేట, తిరుపతి, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు కే.వెంకటరమణారెడ్డి, షణ్మోహన్, ఎస్పీలు పరమేశ్వర్ రెడ్డి, రిషాంత్‌రెడ్డి, జేసీలు శుభం భన్సల్, శ్రీనివాసులు, డీఆర్వోలు పెంచలకిషోర్, రాజశేఖర్ శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని ఆకాంక్షించారు.

నేడు గూడూరుకు 'అమృత్ భారత్'



మాట్లాడుతున్న స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

గూడూరు రూరల్ : అమృత్ భారత్ రైలు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు గూడూరు రైల్వే స్టేషన్‌కు రానున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమృత్ భారత్ రైలు ప్రారంభించిందన్నారు. మాల్దా నుంచి బెంగళూరుకు వెళుతున్న ఈ రైలుకు గూడూరులో స్వాగతం పలికి, సాదరంగా సాగనంపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌యుసీసీ మెంబర్ మయూరి శ్యామ్‌యాదవ్, జీఆర్‌పీ ఎస్‌ఐ కేకే నాయుడు, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ లీలాకృష్ణ, కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.







● కొత్త సందడి

నూతన సంవత్సరం వేడుకలతో ఆదివారం తిరుపతి సందడిగా మారింది. ఫ్లవర్‌బొకేలు.. కేక్‌లు.. స్వీట్ల కొనుగోలుదార్లతో కిక్కిరిసింది. హ్యాపీ న్యూయర్ అంటూ యువత కేరింతలతో మార్మోగింది. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ తిరునగరి ఆనందోత్సాహాలకు వేదికైంది.

– తిరుపతి కల్చరల్

● సైకత స్వాగతం



చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ తనదైన శైలిలో 2024కు స్వాగతం పలుకుతూ సైకత శిల్పం తీర్చిదిద్దారు. ఆదివారం ఆయన సక్సెఫుల్ న్యూ ఇయర్ అని ట్యాగ్ లైన్‌తో రాకెట్ నమూనాను రూపొందించారు. సనత్‌కుమార్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో దేశ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

– చిల్లకూరు

నేటి నుంచి శ్రీరాముని మంత్రాక్షింతల వితరణ



మాట్లాడుతున్న కాకర్ల రాముడు

తిరుపతి కల్చరల్ : అయోధ్యలో ఈనెల 22వ తేదీన రామాలయం ప్రారంభిస్తున్న నేపథ్యంలో స్వామివారి పవిత్ర మంత్రాక్షింతలను సోమవారం నుంచి ఇంటింటికీ వితరణ చేపడుతున్నట్లు వీహెచ్‌పీ దక్షిణాంధ్ర కార్యదర్శి కాకర్ల రాముడు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన మంత్రాక్షింతలను స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. వీహెచ్‌పీ నేతలు నరసింహులు, రమాదేవి, భరణీకృష్ణ పాల్గొన్నారు.

సుపరిపాలనతోనే అభివృద్ధి.. సంక్షేమం

ఏర్పేడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనతోనే రాష్ట్రంలో సంక్షేమం.. అభివృద్ధి సమపాళ్లలో ముందడుగు వేస్తున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం ఏర్పేడులో నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాలుగా గెలిపించిన కుప్పం ప్రజలకే చంద్రబాబు ఏమీ చేయలేదన్నారు. సంపద సృష్టిస్తా అని బీరాలు పలికే బాబు తన సొంత నియోజకవర్గంలో కనీసం ఆర్‌డీఓ కార్యాలయం కూడా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఆయినా ఒక్క అర్జీ పెట్టుకుంటూనే ముఖ్యమంత్రి జగనన్న వెంటనే కుప్పానికి ఆర్‌డీఓ కార్యాలయం మంజూరు చేశారని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తిలో సైతం అడిగిన వెంటనే ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటుకు ఫైల్‌పై సంతకం చేశారని చెప్పారు. మండలంలోని నచ్చనేరిలో చంద్రబాబు అక్రమంగా 20 ఎకరాల డీకేటీ భూములను సంపాదించుకున్నారని ఆరోపించారు. ఏర్పేడులో ఖాళీగా ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకుని సర్పంచ్ శివయ్య విన్నపం మేరకు రూ.కోటి వెచ్చించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. దీంతో పంచాయతీకి ఏటా రూ.30లక్షల ఆదాయం సమకూరుతుందని, దీన్నే సంపద సృష్టి అంటారని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం ఓ అబ్బాయి ఆత్మహత్య చేసుకుంటే క్షుద్ర రాజకీయం చేయాలని బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రయత్నించినట్లు ఆరోపించారు. మృతుడి భార్య ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో వారి నోళ్లు మూతపడినట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో బీసీలకు సమ న్యాయం జరుగుతోందని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిల్లకూరు : మండలంలోని కడివేడు- బూదనం మార్గంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. బూదనం పంచాయతీ పట్రగుంటకు చెందిన కలిచేటి వెంకటేశ్వర్లు(35) కడివేడుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీ వర్కింగ్ నేపథ్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


పెంచల కిషోర్, డీఆర్‌ఓ

ముస్తాబైన కల్యాణ వెంకన్న ఆలయం



చలువ పందిళ్లు



తుమ్మలగుంటకు సరి'కొత్త' శోభ!

- నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం
- ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ
- కనువిందు చేస్తున్న స్వాగత తోరణాలు

తిరుపతి రూరల్ : తుమ్మల గుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం సరికొత్త శోభను సంతరించుకుంది. నూతన సంవత్సర వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విశేష సంఖ్యలో తరలిరానున్న భక్తులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన తోరణాలు ఆకట్టుకుంటున్నాయి. విద్యుద్దీపాలు, వివిధ పుష్పాలంకరణలో ఆలయం దేదీప్యంగా ప్రకాశిస్తోంది. ఆలయంలో ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా పకడ్బందీగా క్యూలు ఏర్పాటు చేశారు. గత ఏడాది రద్దీని దృష్టిలో పెట్టుకుని పక్కాగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. తెలుగు తల్లి విగ్రహం నుంచే వాహనాలకు అనుమతి లేకుండా చర్యలు తీసుకున్నారు. టీటీడీ డెయిరీ ఫామ్ ఆవరణలో వాహనాలు పార్క్ చేసేందుకు స్థలం ఏర్పాటు చేశారు. అలాగే జాతీయ రహదారిపై నుంచి తుమ్మలగుంట ఆలయంకు వచ్చే వాహనాలను తుమ్మల గుంట చెరువు వద్ద పార్క్ చేసేలా పోలీసులు స్థలాలను సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగలో ఆదివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామస్తులు రాజశేఖర్, సుధాకర్, సంపత్‌రావుపై దాడి చేసి గాయపరిచింది. అలాగే మూడు ఆవులను కరిచేసింది. సమాచారం అందుకున్న గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, పారిశుద్ధ్య కార్మికులతో కలసి పిచ్చి కుక్క బంధించారు. సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.


గాయపడిన రాజశేఖర్, ఆవు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వీసీ భారతి తదితరులు


రన్నరప్‌గా నిలిచిన ఎమ్‌జీఎమ్ వర్సిటీ జట్టుకు కప్ అందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి తెలిపారు. వర్సిటీలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళా వాలీబాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. మొత్తం 89 విశ్వవిద్యాలయాల నుంచి 75 జట్లు పాల్గొనగా చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కేరళకు చెందిన కొట్టాయం మహాత్మాగాంధీ యూని వర్సిటీ జట్టు, చెన్నై జుపీయార్ యూనివర్సిటీ జ ట్టు మూడోస్థానం, కాలికట్ యూనివర్సిటీ జట్టు నాలుగో స్థానం దక్కించుకున్నాయి. విజేతలకు వీసీ భారతి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి పోటీ పడడం శుభపరిణామన్నారు. గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ అద్భుత ప్రతిభను కనబరిచారని కొనియాడారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, డీన్ అనూరాధ, ఫిజికల్ డైరెక్టర్ సారా సరోజిని, అబ్జర్వర్ సెల్వకుమార్, టీటీడీ స్పోర్ట్స్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- ఇద్దరి మృతి.. ముగ్గురికి గాయాలు

కేవీబీపురం : మండలంలోని మిద్దెకండ్రిగ వద్ద ఆదివారం ఓ కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. తమిళనాడుకు చెందిన కెప్టెన్ ప్రభాకర్(32), స్టీఫెన్‌రాజ్(32), దినేష్(31), మారుతి(32), కమల్‌రాజ్ (32) ఆరెలోని సిద్దేశ్వరకోన వాటర్ ఫాల్స్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. చెరువులో కారు మునిగిపోవడంతో కెప్టెన్ ప్రభాకర్, స్టీఫెన్‌రాజ్ మరణించారు. మిగిలిన వారు గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో కారును వెలికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సునీల్ వెల్లడించారు.


మృతి చెందిన స్టీఫెన్‌రాజ్, కెప్టెన్ ప్రభాకర్

నగల చోరీలో ముగ్గురిపై కేసు

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట ఏలుమలై వీధిలో ఉన్న ఎస్ఎస్ జ్యువెలరీలో శనివారం రాత్రి చోరీకి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ నిందితులు మారణాయుధాలతో దుకాణం యజమాని కార్తీక్, తదితరులను భయభ్రాంతులకు గురిచేసి రూ.2.90లక్షల విలువైన బంగారు నగలను దోచుకెళ్లినట్లు వెల్లడించారు. 22 గ్రాముల గొలుసు, 8 గ్రాముల చైన్, 8 గ్రాముల పచ్చరాతి ఉంగరం, 12 గ్రాముల 3 బంగారు వెంకటేశ్వర స్వామి ప్రతిమల ఉంగరాలతో మొత్తం 50 గ్రాముల నగలను అపహరించారని వివరించారు. దోపిడీ అనంతరం దుండగులు రోడ్డుపై వెళుతున్న ఓ వ్యక్తిని బెదిరించి రూ.50వేల విలువైన ఏపీ 03 ఏపీ 1190 ద్విచక్ర వాహనాన్ని లాక్కొని వెళ్లినట్లు చెప్పారు. బాధితుడు కార్తీక్ ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రేణిగుంట మండలం పరిసర ప్రాంతాలకు చెందిన విశ్వ, రాజేష్, ఆనంద్ అనే యువకులే దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారని సమాచారం. ఆ మేరకు ఇప్పటికే విశ్వ, రాజేష్‌ను అదుపులోకి సైతం తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : నాయుడుపేట-పూతలపట్టు రహదారిపై తొండమనాడు ఆర్చి వద్ద ఆదివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని గురుకుల పాఠశాల అటెండర్ మృతి చెందాడు. వివరాలు.. నారాయణవనం మండలం, లక్ష్మీపురం ఎస్టీ కాలనీకి చెందిన పురుషోత్తం(48) రేణిగుంటలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై శ్రీకాళహస్తి వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.